వక్ఫ్ ఆస్తుల్లో కేంద్రం జోక్యం!

- వివాదాస్పద భూముల్లో కలెక్టర్‌దే నిర్ణయం
- బోర్డుల్లో మహిళలు, ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం
- వక్ఫ్ చట్టానికి సవరణలు ప్రతిపాదించిన కేంద్రం
- ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్న ప్రతిపక్ష పార్టీలు
- బిల్లును జేపీసీకి పంపేందుకు అంగీకరించిన కేంద్రం

లోక్‌సభలో మాట్లాడుతున్న ఒవైసీ, అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు ప్రతిపాదించడం ద్వారా మరో వివాదానికి తెరలేపింది. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ బోర్డుల అధికారాలు, వాటి పనితీరులో మార్పులు చేస్తూ వక్ఫ్ చట్టం 1995కు ప్రభుత్వం సవరణలు ప్రతిపాదించింది. లోక్‌సభలో గురువారం మైనార్టీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈ సవరణలను ప్రతిపాదించారు. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ, పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేస్తూ కొత్త బిల్లును తెచ్చారు. 1995 నాటి వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలను ప్రతిపాదించారు. వక్ఫ్ యాక్ట్, 1995 పేరును 'యునిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫికసీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్, 1995'గా మార్చుతున్నట్టు బిల్లులో పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులను నియంత్రించే అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు దఖలుపరిచే విధంగా సవరణలు ప్రతిపాదించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా మహిళలతోపాటు, ముస్లిమేతరులకు వక్ఫ్‌బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపాదనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో కొంత వెనక్కు తగ్గిన కేంద్ర ప్రభుత్వం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపేందుకు అంగీకరించింది. కాగా, ముసల్మాన్ వక్ఫ్ చట్టం-1923ను రద్దు చేస్తూ, కేంద్రం మరో బిల్లును సభ ముందుకు తీసుకొచ్చింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, 'వక్ఫ్ చట్టం-1995 వచ్చాక, ముసల్మాన్ వక్ఫ్ యాక్ట్-1923 దాని ఉనికిని కోల్పోయింది. ఈ చట్టం అవసరం లేదు' అని అన్నారు.

క్రూరమైన చట్టం: విపక్షాలు

వక్ఫ్ బిల్లును తీసుకురావటంపై లోక్‌సభలో విపక్షాలు మండిపడ్డాయి. ప్రతిపాదిత చట్టాన్ని క్రూరమైందిగా పేర్కొన్నాయి. రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించాయి. ఆర్టికల్ 14, 15, 25ను ఈ బిల్లు ఉల్లంఘిస్తున్నదని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఇది వివక్షాపూరితమైనదని, రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడిచేయడమేనని పేర్కొన్నారు. బీజేపీ మద్దతుదారులను సంతోషపరిచేందుకు వక్ఫ్ బిల్లును తీసుకొచ్చారని సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు చోటు కల్పించటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు సమాజ్‌వాదీ, ఎన్‌సీపీ (శరద్‌పవార్ పార్టీ), ఏఐఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించాయి. మోదీ సర్కార్ మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. వివిధ రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ బిల్లును తీసుకొచ్చారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆరోపించారు.

రాజకీయాల కోసమే వ్యతిరేకిస్తున్నాయి : కిరణ్ రిజిజు

విపక్ష సభ్యుల ఆందోళనపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, వక్ఫ్ బిల్లుతో ఏ మత సంస్థ స్వేచ్ఛకూ భంగం వాటిల్లదని చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లుపై పునఃపరిశీలన కోసం సంయుక్త పార్లమెంట్ కమిటీకి పంపుతూ సిఫారసు చేస్తున్నామని, కేవలం రాజకీయాల కోసమే విపక్షాలు బిల్లును వ్యతిరేకిస్తున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. కేవలం పార్టీ నుంచి వస్తున్న ఒత్తిడితోనే కొంతమంది ఎంపీలు బిల్లును వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వక్ఫ్ బోర్డులు మాఫియా చేతిలోకి వెళ్లిపోయాయని చాలామంది ఎంపీలు తనకు వ్యక్తిగతంగా తెలియజేశారని అన్నారు.

వక్ఫ్ అంటే ఏమిటి?

ఇస్లామిక్ చట్టం ప్రకారం కేవలం మతపరమైన లేదా స్వచ్ఛంద సేవాపరమైన కార్యక్రమాల కోసం కేటాయించిన ఆస్తిని వక్ఫ్ అని అంటారు. ఒకసారి ఏదైనా ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటించిన తరువాత ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొనే అవకాశం ఉండదు. దేశవ్యాప్తంగా ఉన్న 30 వక్ఫ్ బోర్డుల పరిధిలో రూ.1.2 లక్షల కోట్ల విలువైన తొమ్మిది లక్షల ఎకరాల భూములు ఉన్నాయి. రైల్వేలు, రక్షణశాఖ అనంతరం దేశంలో అత్యధిక స్థాయిలో భూములున్న మూడో సంస్థగా వక్ఫ్‌బోర్డు నిలుస్తున్నది.

వక్ఫ్ చట్టానికి కేంద్రం ప్రతిపాదించిన సవరణల్లో ముఖ్యమైనవి..

1. **వక్ఫ్ చట్టంలోని వివాదాస్పద సెక్షన్ 40 తొలగింపు:** ఏవైనా ఆస్తులు వక్ఫ్ ఆస్తులా కాదా అని నిర్ధారించేందుకు బోర్డుకు అధికారాలు కల్పిస్తున్న సెక్షన్ 40ని తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. 1995 నాటి వక్ఫ్ చట్టానికి 2013లో చేసిన సవరణ ప్రకారం.. ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుకు చెందుతుందా లేదా?, ఏదైనా ఆస్తి సున్నీ వక్ఫ్‌కు చెందుతుందా లేక షియా వక్ఫ్‌కు చెందుతుందా అని నిర్ణయించే అధికారాన్ని వక్ఫ్‌బోర్డుకు దఖలుపరిచారు. ఇటువంటి కేసులో బోర్డు ముందుగా నోటీసులు జారీచేసి, విచారణ జరిపి, ఆపై సరైన నిర్ణయం తీసుకుంటుంది. ఈ నిర్ణయంతో విభేదించే వారు ట్రిబ్యునల్‌కు వెళ్లవచ్చు. అక్కడి నుంచి వచ్చేదే తుది తీర్పు.
2. **మధ్యవర్తిగా జిల్లా కలెక్టర్:** ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే వక్ఫ్ ఆస్తుల ధ్రువీకరణ తప్పనిసరి అవుతుంది. దేశంలోని వక్ఫ్‌బోర్డులన్నీ తమ పరిధిలోని ఆస్తుల ధ్రువీకరణ, పర్యవేక్షణ కోసం వాటిని జిల్లా అధికార యంత్రాంగం వద్ద రిజిస్టర్ చేయాలి. ఏదైనా వివాదం ఏర్పడినప్పుడు సదరు భూమి ప్రభుత్వానిదా లేక వక్ఫ్‌బోర్డుదా అన్న విషయాన్ని తేల్చేందుకు జిల్లా కలెక్టర్ మధ్యవర్తిగా వ్యవహరిస్తారు. 1995 నాటి చట్టం ప్రకారం ఇటువంటి వివాదాలపై వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకునేది. జిల్లా కలెక్టర్/ మేజిస్ట్రేట్ వక్ఫ్‌బోర్డుల ఆదాయాన్ని పర్యవేక్షిస్తారు.
3. **వివాదాస్పద భూముల పునఃధ్రువీకరణ:** వివాదాస్పద భూముల యాజమాన్యం, నిర్వహణపై స్పష్టత వచ్చే విధంగా.. వాటిపై తప్పనిసరిగా పునఃధ్రువీకరణ జరగాలి. ప్రతిపాదిత సవరణ ద్వారా ఏదైనా వక్ఫ్ ఆస్తిపై ఆడిట్ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుంది. కాగ్ నియమించే ఆడిటర్ ద్వారా సదరు ఆస్తిని తనిఖీ చేయవచ్చు.
4. **వక్ఫ్‌బోర్డులో మహిళలు, ముస్లిమేతరులు:** కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్రాల వక్ఫ్‌బోర్డుల్లో మహిళలకు, ముస్లిమేతరులకు భాగస్వామ్యం. స్టేట్ బోర్డులతోపాటు సెంట్రల్ కౌన్సిల్లో ఇద్దరు మహిళలకు చోటు కల్పించాల్సి ఉంటుంది.
5. **బోహ్రాలు, ఆగాఖనీలకు ప్రత్యేకంగా ఔఖాఫ్ బోర్డు:** ముస్లింలలోని షియా, సున్నీ, బోహ్రా, ఆగాఖని, ఇతర వెనుకబడిన వర్గాల వారికి కూడా బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించాలి. బోహ్రాలు, ఆగాఖనీలకు ప్రత్యేకంగా ఔఖాఫ్ బోర్డును ఏర్పాటుచేయాలి.

లోక్‌సభలో రాహుల్ కునుకు

- వక్ఫ్ బిల్లుపై వాడీవేడిగా చర్చ జరుగుతుండగా ఎంచక్కా నిద్రపోయిన ప్రతిపక్ష నేత
- ఎగతాళి చేసిన కేంద్రమంత్రి, ఎంపీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: పార్లమెంట్ సమావేశాల సందర్భంగా గురువారం లోక్‌సభలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించి లోక్‌సభలో ఒక పక్క వాడీవేడిగా చర్చలు జరుగుతుండగా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కునుకు తీస్తూ కన్పించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చర్చ సందర్భంగా రాహుల్ అలా నిద్రపోవడాన్ని పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు, బీజేపీ ఎంపీ గిరిరాజ్‌సింగ్ ఎగతాళి చేశారు. పదేపదే మాట్లాడుతూ తోటి సభ్యుని నిద్రకు భంగం కలిగించకండి అంటూ రిజిజు చమత్కరించారు. మైనారిటీలకు సంబంధించిన ముఖ్యమైన సవరణ బిల్లుపై చర్చ జరుగుతుంటే బాధ్యత గల విపక్ష నేతకు ఇది తగునా? అని పలువురు సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించారు. ప్రజల కోసం సభలో నిద్రపోతూ కష్టపడుతున్న మన ప్రియతమ రాహుల్ గాంధీని చూడండి అంటూ ఒకరు, రాహుల్ గాంధీ శక్తి సామర్థ్యాలు ఏంటో ప్రజలకు తెలియాలంటే ఈ వీడియోను తప్పక షేర్ చేయాల్సిందేనని మరొకరు వ్యాఖ్యానించారు.

రాజ్యసభ చైర్మన్ వాకౌట్!

న్యూఢిల్లీ: గురువారం రాజ్యసభలో విపక్ష సభ్యులకు, సభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్‌కు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. టీఎంసీ, ఇతర విపక్ష ఎంపీల తీరుపై చైర్మన్ ధన్‌కర్ మండిపడ్డారు. సభను నడుపలేనంటూ తన సీట్లో నుంచి లేచి వెళ్లిపోయారు. భారత రెజ్లర్ వినేశ్ ఒలింపిక్స్‌లో అనర్హత వేటుకు గురైన అంశాన్ని విపక్ష నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గే లేవనెత్తగా, ధన్‌కర్ చర్చకు అనుమతించలేదు. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, చైర్మన్ ధన్‌కర్ మధ్య కొంతసేపు మాటల యుద్ధం నడిచింది. సభ నుంచి బయటకు పంపుతానంటూ ఒబ్రెయిన్‌ను చైర్మన్ హెచ్చరించారు. దీంతో విపక్ష సభ్యులంతా లేచి నిలబడి గట్టిగా నినాదాలు చేయటంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది.

స్పీకర్ హక్కులపై అఖిలేశ్, షా మధ్య వాగ్వాదం

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ హక్కులపై గురువారం సభలో సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మధ్య వాగ్వాదం జరిగింది. వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ, 'లోక్‌సభ స్పీకర్ హక్కులు, మా హక్కుల్ని ఇక్కడ కాలరాస్తున్నారు. ప్రజాస్వామ్యానికి న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న మీ (లోక్‌సభ స్పీకర్) హక్కుల్ని హరిస్తుంటే, మేం మీ తరపున పోరాడాల్సి వస్తున్నది' అని అన్నారు. ఆ వెంటనే అమిత్ షా కలుగజేసుకొని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభాపతిని కించపరుస్తున్నారంటూ అఖిలేశ్‌పై మండిపడ్డారు. డొంకతిరుగుడుగా మాట్లాడొద్దని అన్నారు. స్పీకర్ హక్కులకు విపక్షాలు పరిరక్షకులు కారంటూ వ్యాఖ్యానించారు.

'పంటలకు ఎమ్మెస్పీ అమలుచేయాలి'

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రైతుల పంటలను ఎమ్మెస్పీ రేట్లకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని, రైతులకు న్యాయం చేయాలని విపక్ష ఎంపీలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. టీఎంసీ, ఆర్జేడీ, ఎన్‌సీపీ (శరద్‌పవార్), శివసేన (యుబీటీ), ఇతర ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో గురువారం నిరసనకు దిగారు. కూరగాయలతో కూర్చిన దండను మెడలో వేసుకున్న విపక్ష ఎంపీలు పార్లమెంట్ మకర ద్వారం మెట్ల వద్ద ఆందోళన చేపట్టారు. 'ఎన్డీయే మిత్ర పక్షాలు టీడీపీ, జేడీయూలకు కేంద్రం ఎలాగైతే కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) ఇచ్చిందో, దేశంలోని రైతులకు కూడా ఎమ్మెస్పీ అమలుజేయాలి' అని శివసేన (యుబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది డిమాండ్ చేశారు.

తెలంగాణలో పెరిగిన అటవీ విస్తీర్ణం

దేశంలో గత పదేండ్లలో 1,700 చ.కి.మీ తగ్గిన అటవీ భూమి

న్యూఢిల్లీ, ఆగస్టు 8: దేశంలో గత 10 ఏండ్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు 1,700 చదరపు కిలోమీటర్లకు పైగా అటవీ ప్రాంత భూమిని కోల్పోయామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే తెలంగాణ, మరికొన్ని రాష్ట్రాల్లో అటవీ ప్రాంత విస్తీర్ణం పెరిగినట్టు పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, మిజోరాం, మేఘాలయ రాష్ట్రాల్లో అటవీ విస్తీర్ణం తగ్గిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ఫలితంగానే రాష్ట్రంలో పచ్చదనం భారీగా పెరిగినట్టు కేంద్రం ప్రకటన ద్వారా స్పష్టమవుతున్నది.

చంద్రుడిపై లైఫ్ బ్యాంక్

ఫ్లోరిడా, ఆగస్టు 8: అంతరించిపోతున్న దశలో ఉన్న 10 లక్షల జాతులు జీవరాశులను బతికించాలన్న ఉద్దేశంతో శాస్త్రవేత్తలు చంద్రుడిపై లైఫ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. చంద్రుడిపై ఆవాసం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో.. భూమిపై ప్రమాదంలో ఉన్న జీవాల కణాలను చంద్రుడిపైకి తరలించి, వాటిని రక్షించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా డీఎన్ఏ, విత్తనాలు, కణాలు, కణజాలాలను ద్రవ నైట్రోజన్‌ను ఉపయోగించి ఘనీభవింపజేసి.. చంద్రుడిపైకి తరలిస్తారు. చంద్రుడి ఉపరితలంపై ఎలాగూ ఉష్ణోగ్రత -180 డిగ్రీల నుంచి -230 డిగ్రీలు ఉంటుంది. కాబట్టి జీవ పదార్థాలు భద్రంగా ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఫిబ్రవరి వరకు ఐఎస్ఎస్‌లోనే సునీతా విలియమ్స్!

వాషింగ్టన్, ఆగస్టు 8: అమెరికా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ల అంతరిక్ష ప్రయాణం.. అనుకోని ఆటంకాలను ఎదుర్కొంటున్నది. తొలుత 8 రోజులు అనుకున్న ఈ మిషన్.. చివరికి 8 నెలలకు దాకా ఎటూ తేలేట్టు కనపడటం లేదు. ఇద్దరు వ్యోమగాముల్ని 2025 ఫిబ్రవరిలో భూమి మీదకు తీసుకొచ్చేందుకు రకరకాల ఆప్షన్లను నాసా ఆలోచిస్తున్నదట! ఈ ఏడాది జూన్‌లో బోయింగ్ కంపెనీకి చెందిన 'స్టార్ లైనర్' రాకెట్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోని అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)కు పంపింది. . అయితే స్టార్ లైనర్‌లో హీలియం లీకేజ్ కారణంగా ప్రపొల్షన్ సిస్టంలో సమస్యలు తలెత్తాయి. దీంతో వారి తిరుగు ప్రయాణం నిలిచిపోయింది.

26న స్పేస్ ఎక్స్ 'పోలారిస్ డాన్' ప్రయోగం

వాషింగ్టన్, ఆగస్టు 8: ప్రైవేట్ రంగ అంతరిక్ష సంస్థ 'స్పేస్-ఎక్స్' ఆగస్టు 26న చరిత్రాత్మక ప్రయోగాన్ని చేపట్టబోతున్నది. పోలారిస్ డాన్‌గా పేర్కొంటున్న ఈ మిషన్‌లోని వ్యోమగాములు అంతరిక్షంలో 'స్పేస్ వాక్' చేయనున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని దాటి.. భూమికి దాదాపు 700 కిలోమీటర్ల ఎత్తులోకి వ్యోమగాముల్ని తీసుకెళ్తారు. అపోలో మిషన్ తర్వాత మరే ప్రాజెక్ట్‌లోనూ మానవులను ఇంత ఎత్తుకు తీసుకెళ్లలేదు. అంతేగాక, అపోలో తర్వాత ఓ ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ వాక్ చేపట్టనుండటం ఇదే తొలిసారి. ఈ విషయాన్ని ఆ ప్రాజెక్ట్ బృందం సోషల్ మీడియా 'ఎక్స్'లో తాజాగా వెల్లడించింది.

నానమ్మ ఇంటినే కూల్చేసిన కిమ్

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన సవతి బామ్మ కిమ్ సోంగ్ ఆయే నివసించిన భారీ భవంతిని నేలమట్టం చేయించారు. ఈ రాజ భవనాన్ని నిర్వహించేందుకు అవసరమైనంత సొమ్ము లేకపోవడమే దీనికి కారణమని చెప్తున్నారు. అయితే వీరిద్దరికీ పొసగేది కాదని కూడా అంటున్నారు. ఆమె భర్త 1994లో మరణించిన తర్వాత ఆమెను గృహ నిర్బంధంలో 2014లో మరణించారు. ఆమె నివసించిన రాజప్రాసాదాన్ని కిమ్ జోంగ్ ఉన్ నేలమట్టం చేయడంలోని ఆంతర్యమేమిటో తెలియడం లేదని పరిశీలకులు అంటున్నారు. విల్లాలను కూల్చేయడం ఈ రాజ వంశానికి కొత్త కాదని వారు పేర్కొంటున్నారు.

కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంలకు సమన్లు

బెంగళూరు, ఆగస్టు 8: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్‌లకు బెంగళూరు కోర్టు గురువారం సమన్లు జారీ చేసింది. ఈ నెల 29న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. జూన్ 2022లో కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు సంబంధించిన కేసులో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. రాహుల్ గాంధీని ఈడీ మాటిమాటికీ ప్రశ్నిస్తున్నదని.. ఇది అనవసరంగా వేధించడమేనని ఆరోపిస్తూ జరిగిన ఆనాటి ధర్నాలో సిద్ధరామయ్య, శివకుమార్ పాల్గొన్నారు. ఈ ధర్నాపై నిషేధం ఉన్నా కాంగ్రెస్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీని వల్ల ప్రజల శాంతికి భంగం కలిగిందన్న ఆరోపణలపై విల్సన్ గార్డెన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

సుప్రీంకోర్టులో నేడు సినిమా ప్రదర్శన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఇతర సిబ్బంది కుటుంబాల కోసం శుక్రవారం 'లాపతా లేడీస్' సినిమాను సుప్రీంకోర్టులో ప్రదర్శిస్తారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని చాటి చెప్పే ఈ చిత్రాన్ని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సహా ఇతర న్యాయమూర్తులు, రిజిస్ట్రీ అధికారులు, బాలీవుడ్ ప్రముఖులు అమీర్ ఖాన్, కిరణ్ రావు కూడా వీక్షిస్తారు.

యూట్యూబ్ చూసి బాంబు తయారుచేసిన పిల్లలు

పేలడంతో ఐదుగురికి గాయాలు

పాట్నా: బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఐదుగురు బాలలు యూట్యూబ్ చూసి బాంబు తయారు చేయడం నేర్చుకున్నారు. అగ్గిపుల్లల నుంచి గన్‌పౌడర్‌ను సేకరించి, ఓ టార్చిలైట్‌లో పోశారు. అనంతరం ఓ బ్యాటరీని అనుసంధానం చేసి, టార్చిలైట్‌ను స్విచాన్ చేశారు. దీంతో అది వెంటనే పేలింది. ఈ దుర్ఘటనలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడగా, నలుగురు బాలలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరికీ గయాఘాట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయిస్తున్నారు..

బుద్ధదేవ్ కన్నుమూత

- వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన బెంగాల్ మాజీ సీఎం
- బెంగాల్‌లో పరిశ్రమలకు బాటలుపరిచిన వామపక్ష నేత

కోల్‌కతా, ఆగస్టు 8: బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య (80) కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన వృద్ధాప్య కారణాలతో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, లింగమార్పిడి చేసుకున్న కుమార్తె (ప్రస్తుతం కుమారుడు) సుచేతన ఉన్నారు. భట్టాచార్య తన మృతదేహాన్ని వైద్య పరిశోధనలకు దానం చేశారు. దీంతో ఆయనకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు నివాళి అర్పించిన అనంతరం శుక్రవారం ఆయన పార్థివ దేహాన్ని దవాఖానకు అప్పగిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీమ్ తెలిపారు. సుదీర్ఘ కాలం బెంగాల్ ముఖ్యమంత్రిగా చేసిన జ్యోతిబసు అనంతరం 2000లో ఆయన నుంచి పార్టీ పగ్గాలు చేపట్టిన బుద్ధదేవ్ పార్టీని ఎన్నికల్లో గెలిపించి రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేశారు. పరిశ్రమల స్థాపనకు వ్యతిరేకి అని పార్టీపై పడిన ముద్రను చెరిపేయడానికి ఆయన అనేక సంస్కరణలు చేపట్టి పారిశ్రామికీకరణను ప్రోత్సహించారు. పదవిలో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఆయన అత్యంత నిరాడంబర జీవితం గడిపారు. బెంగాల్‌లో 34 ఏండ్ల వామపక్ష శకం ముగిసి 2011 అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ అధికారం చేపట్టిన తర్వాత ఆయన చిన్న అపార్ట్‌మెంట్‌కే పరిమితం అయ్యారు. చాలా అరుదుగా ప్రజలకు దర్శనమిచ్చేవారు. కాగా, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆయన గృహానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. రాజకీయ రంగంలో అవిశ్రాంతంగా పోరాడారని, పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువరానివని అన్నారు. అలాగే భట్టాచార్య మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ సీవీ ఆనంద్ బోస్, బీజేపీ నేత సువేందు అధికారి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బుద్ధదేవ్ మృతి పట్ల హరీశ్ రావు సంతాపం

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల మాజీ మంత్రి టీ హరీశ్ రావు విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి, పశ్చిమ బెంగాల్ ప్రజలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బెంగాల్ రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఎంతో అంకితభావంతో కృషి చేశారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ నివాళి

బుద్ధదేవ్ భట్టాచార్య(80) మృతి పట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆయన చిత్రపటానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. 2000 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్‌కు సేవలందించారని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి, పరిశ్రమలను నెలకొల్పడానికి కృషి చేశారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు, జాన్‌వెస్లీ, టి సాగర్, పి ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె బాబురావు, ప్రజా సంఘాల నాయకులు కోట రమేష్, మూడ్ శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లా ప్రభుత్వాధినేతగా యూనస్ ప్రమాణం

- 16 మందితో సలహామండలి
- విద్యార్థి నేత నహీద్‌కు చోటు

ఢాకా, ఆగస్టు 8: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్‌గా నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇది ప్రధాని పదవితో సమానమని అధికారులు ప్రకటించారు. అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించడానికి 16 మంది సభ్యులతో సలహా మండలిని ప్రకటించారు. ఇందులో విద్యార్థి ఉద్యమానికి నేతృత్వం వహించిన మహ్మద్ నహీద్ ఇస్లామ్, ఆసిఫ్ మహమ్మద్‌లకు కూడా స్థానం కల్పించారు. ప్రస్తుతం దేశంలో శాంతిని నెలకొల్పి పౌరులకు రక్షణ కల్పించడమే తమ తొలి ప్రాధాన్యమని 84 ఏండ్ల యూనస్ తెలిపారు.

హసీనా తిరిగి బంగ్లాదేశ్‌కు వస్తారు: కుమారుడు సజీబ్

అల్లర్లు, అస్థిరతతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో పరిస్థితులు సద్దుమణిగి, ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిన తర్వాత మాజీ ప్రధాని షేక్ హసీనా తిరిగి స్వదేశానికి చేరుకుంటారని ఆమె కుమారుడు సజీబ్ వాజీద్ జాయ్ పేర్కొన్నారు. ప్రస్తుతం చోటుచేసుకున్న హింసను మరింత రెచ్చగొట్టడానికి పాకిస్థాన్ నిఘా వ్యవస్థ ఐఎస్ఐ మరింత ఆజ్యం పోస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఆయన గురువారం పీటీఐతో మాట్లాడుతూ తన తల్లి హసీనా తప్పక బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తారని పేర్కొన్నారు. అయితే ఆమె రాజకీయాల నుంచి నిష్క్రమించిన నేతగా వస్తారో, క్రియాశీలక నేతగా వస్తారో ఇంకా నిర్ణయించలేదని అన్నారు. షేక్ ముజీబ్ కుటుంబం ఎన్నడూ దేశ ప్రజలను వదిలి వెళ్లదని, ప్రస్తుత పరిస్థితులతో అవాక్కయి ఉన్న అవామీ లీగ్ పార్టీని అనాథలా వదిలేయరని ఆయన స్పష్టం చేశారు. బంగ్లాపై అంతర్జాతీయ సమాజ అభిప్రాయాన్ని సేకరించడమే కాక, బంగ్లాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు భారత ప్రధాని మోదీ కృషి చేయాలని విజ్ఞప్తి చేశార